




దిన పత్రిక

# తొలి సమయం

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 14 మంగళవారం 14-01-2025 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..




## ఇచ్చిన హామీలు

# నెరవేరుస్తున్నాం

### మంచుకొండ ఎత్తిపోతల పథకానికి మంత్రుల శంకుస్థాపన

**ఖమ్మం,జనవరి13:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాబోయే నాలుగేళ్లలో అన్ని ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని మంత్రులు స్పష్టం చేశారు. సీతారామ పూర్తి చేసి గోదావరి జలాలు.. ఖమ్మం జిల్లాకు తీసుకు వస్తామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచిన మీ త్యాగాలు మర్చిపోమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రూ. పది వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరాకు కూడా సాగునీరు ఇవ్వలేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జూలూరుపాడు టన్నెల్ పూర్తయితే.. పాలేరుకు గోదావరి జలాలు వస్తాయన్నారు. ఖమ్మం జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాలు సస్యశ్యామలం చేయాలన్నదే తన రాజకీయ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అలాగే సీతారామ ప్రాజెక్ట్ పూర్తి కావడంతోపాటు భద్రాచలంకి రైల్వే లైన్, కొత్తగూడెంకు ఎయిర్ పోర్ట్ రావాలన్నారు. మీ కష్టాలు తెలుసు, మీ అవసరాలు సైతం తనకు తెలుసునన్నారు. అన్ని పనులు పూర్తి చేసి.. మీతో శబాష్ అనిపించుకుంటా నని.. అంతే తప్ప. ఛీ ఛీ అని మాత్రం అనిపించుకోనని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం జిల్లాలోని రఘునాధపాలెం మండలం మంచుకొండ ఎత్తిపోతల పథకానికి తుమ్మలతోపాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగిలేటి శ్రీనివాసరెడ్డి తదితరులు శంకుస్థాపన చేశారు. అనంతరం వరుసగా మంత్రులు మాట్లాడారు. ఆ క్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ ఏడాది సత్తుపల్లి ట్రంక్ పూర్తి చేసి గోదావరి జలాలను పూర్తి చేస్తానని స్పష్టం చేశారు. పామాయిల్ సాగు చేయాలని ఈ సందర్భంగా రైతులకు ఆయన పిలుపు నిచ్చారు. ప్రతి జిల్లాలో పామాయిల్ ఫ్యాక్టరీలు స్థాపించి.. రైతులను రాజులుగా నిలబెట్టే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదని ఆయన పేర్కొన్నారు. 46 మండలాలకు సాగు నీరు అందించే భాగ్యం తనకు దక్కిందంటూ మంత్రి తుమ్మల ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు. ఒక్క రఘునాధ పాలెం మండలానికి సాగు నీరు ఇవ్వలేక పోయానన్న బాధ గతంలో ఉండేదని.. ఇప్పుడా ఆ బాధ సైతం తనకు లేదన్నారు. మీరు పామాయిల్ సాగు చేయండి.. ఉగాది నాటికి సాగు నీరు తీసుకు వచ్చి మీ మొక్కలు బతికిస్తాంటూ రైతులకు మంత్రి తుమ్మల భరోసా ఇచ్చారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యం వచ్చి ఏడాది పూర్తియిందని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను ఒకోక్కటిగా నెరవేరుస్తున్నామని అన్నారు. ప్రతిపక్షం అవాక్కులు చవాక్కులు పేలినా.. వాటిని పట్టించుకోకుండా అభివృద్ధి, సంక్షేమం కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రతి పేద వాడికి అభివృద్ధి సంక్షేమం అందజేస్తామన్నారు. అలాగే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. 2500 ఎకరాలకు సాగునీరు అందించే ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. అపర భగీరథుడు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మీకు మంత్రిగా ఉండటం అదృష్టమని పేర్కొన్నారు. మంత్రులమంతా సమన్వయంతో పని చేస్తున్నామని తెలిపారు.

## వేడెక్కుతున్న

# ఢిల్లీ ఎన్నికలు

### నామినేషన్ వేసిన సిఎం అతిషి



**న్యూఢిల్లీ,జనవరి13:** దేశ రాజధాని దిల్లీలో మరికొన్ని రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగ నున్నాయి. పోలింగ్ తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రధాన పార్టీల ప్రచారం వేడెక్కింది. రానున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ఢిల్లీ ముఖ్య మంత్రి అతిషి సోమవారం నామినేషన్ పత్రాలను సమర్పించారు. కల్కాజీ నియోజకవర్గం నుండి ఆమె పోటీకి దిగుతున్న సంగతి తెలిసిందే. నామినేషన్ పత్రాల దాఖలుకు ముందు కల్కాజీ నియోజకవర్గంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో అతిషితో పాటు ఆప్ నేత మనీష్ సిసోడియా కూడా పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గం అభివృద్ధి కోసం గత ఐదేళ్లుగా అవిశ్రాంతంగా కృషి చేశానని అన్నారు. కల్కాజీ ప్రజలు తన కుటుంబమని, వారు తనను సోదరిగా, కుమార్తెగా భావిస్తారని అన్నారు. తాను కేవలం ఈ నియోజకవర్గ ప్రతినిధిని మాత్రమే కాదని, వారి జీవితంలో ఓ భాగంగా భావిస్తారని అన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆప్ కట్టుబడి ఉందని అన్నారు. బిజెపి పేదలకు వ్యతిరేకి అని, మురికివాడలకు వ్యతిరేకి అని దుయ్యబట్టారు. అతిషీకి పోటీగా బిజెపి నుండి రమేష్ బిదూరి, కాంగ్రెస్ నుండి మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లంబాలు బరిలోకి దిగుతున్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఫిబ్రవరి 5న జరగనుండగా, ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడనున్నాయి.

## అనర్హులకు ఇళ్లు వస్తే

# కలెక్టర్లదే బాధ్యత

### మంత్రి కోమటిరెడ్డి సున్నితంగా హెచ్చరిక

**ఖమ్మం,జనవరి13:** అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాల్సి ఉందని, భవనాలు ఉన్న వారికి ఇళ్లు ఇస్తే మొదటి బాధ్యులు కలెక్టర్ అవుతారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. అర్హులైన వారికి ఇళ్లు రావాలన్నారు. అధికారులు, సిబ్బంది కీలక పాత్ర వహించాల్సి వుంటుంది.. అధికారులు, సిబ్బంది అలసత్వం ఉండొద్దు.. గ్రామాలు మీ ఇళ్లు అనుకుని పని చేయండి అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూచించారు. జిల్లాలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ.. కొంచెం ఇంపా÷–టంగ్త÷ంట్ మీటింగ్ కారణంగా ఆలస్యంగా వచ్చానన్నారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకస్మిక పర్యటనలు ఉంటాయని తెలిపారు. అక్రమాలు జరుగకుండా చూడాలన్నారు.అలాగే, ప్రజా పాలనలో ప్రజలు ఎంతో ఆశతో, నమ్మకంతో ఈ ప్రభుత్వాన్ని గెలిపించారు అని రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్? రెడ్డి తెలిపారు.

## కిషన్ రెడ్డి నివాసంలో ఘనంగా

# సంక్రాంతి వేడుకలు

### ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని మోడీ,స్పీకర్ ఓం బిర్లా

### చిరంజీవి, పలువురు కేంద్రమంత్రులు, నేతల రాక

**న్యూఢిల్లీ,జనవరి13:** తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. రంగురంగుల రంగవల్లులతో గ్రామాలు, పట్టణాలు ముస్తాబు కాగా.. కోడి పందేలు, ఎడ్ల పందేలతో పండగను ఘనంగా నిర్వహిస్తున్నారు. మరోవైపు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఇంట్లో సంక్రాంతి సంబరాలు హోరెత్తిపోతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలోని ఆయన నివాసంలో సోమవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోపాటు పలువురు కేంద్ర మంత్రులు, సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ వేడుకల్లో స్పీకర్ ఓం బిర్లా, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసరాజు, సినీనటుడు చిరంజీవి, ఏఐజీ ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, పీవీ సింధు వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను మోదీ వీక్షించారు. గాయని సునీత పాటలతో అలరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి వెంకటేశ్వరస్వామి ప్రతిమను కిషన్‌రెడ్డి అందజేశారు. ఎంపీలు లక్ష్మణ్, అనురాగ్ ఠాకూర్, ఈటెల రాజేందర్, ధర్మపురి అరవింద్, రఘునందన్ రావు, లక్ష్మణ్, గోడెం నగేష్, బాలశౌరి, కొండ విశ్వేశ్వర్ రెడ్డి , డి.కె.అరుణ సహా పలువురు తెలంగాణ బీజేపీ నేతలు సైతం వేడుకలో పాల్గొన్నారు. అలాగే లోక్ సభ




స్పీకర్ ఓం బిర్లా, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, జ్యోతి రాధిత్య సింధియా, మనోహర్ లాల్ కట్టర్, పెమ్మసాని చంద్రశేఖర్, బండి సంజయ్, సతీశ్ చంద్ర దూబే, శ్రీనివాస్ వర్మ హాజరయ్యారు. మరోవైపు పలువురు ఎంపీలు, పారిశ్రామికవేత్తలు, బీజేపీ నేతలు కిషన్ రెడ్డి నివాసానికి భారీగా చేరుకున్నారు. కేంద్ర మంత్రి నివాసానికి చేరుకున్న ప్రధాని మోదీకి కిషన్ రెడ్డి, చిరంజీవి, పెమ్మసాని చంద్రశేఖర్ సాదర స్వాగతం పలికారు. సంక్రాంతి వేడుకల నేపథ్యంలో తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా కిషన్ రెడ్డి ఇంటిని ముస్తాబు చేశారు. అతిథులకు తెలుగు వంటలను సైతం రుచి చూపించేలా పలు వంటకాలను సిద్ధం చేశారు.

## గత ఏడాదిలో హతమైన ఉగ్రవాదుల్లో

# పాకిస్తానీయులే ఎక్కువ

### ఆర్మీచీఫ్



**న్యూఢిల్లీ, జనవరి 13:** గతేడాది హతమైన ఉగ్రవా దుల్లో 60 శాతం మంది పాకిస్తాన్ సంతతికి చెందిన వారేనని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు. హింసను ప్రేరేపించేందుకు పాకిస్తాన్ పాత్ర ఏంటో ఈ చర్యతో తెలిసిపోతుంద న్నారు. జనవరి 15వ తేదీన ఆర్మీ డే సందర్భంగా ఆర్మీ చీఫ్ జనరల్ సోమవారం మీడియాతో మాట్లాడారు. పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులు జమ్మూకశ్మీర్‌లో హింసను ప్రేరేపిస్తున్నారని తెలిపారు. ఉగ్రవాద చర్యలను నిరోధించేందుకు గతేడాది 15 వేల మంది సైనికులను చేర్చుకుకోవడంతో ఎంతో దోహదపడిందని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో పర్యాటకం అభివృద్ధి చెందుతున్న సమయంలోనే ఉగ్రవాదులు తమ చర్యలను వేగం చేశారు. ఈ ఉగ్రవాదుల్లో 80 శాతం మంది పాకిస్తానీలు ఉన్నారని, గతేడాది 60 శాతం మందిని అంతమొందించామని తెలిపారు. ఇక భారత్, చైనా సైన్యాల మధ్య విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి ప్రయత్నాలు అవసరమని పేర్కొన్నారు. సరిహద్దుల్లో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. సరిహద్దుల్లో మౌలిక సదుపాయాలు పెంచడం, కెపబిలిటీ డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించామని తెలిపారు. చొరబాటు ప్రయత్నాలను అడ్డుకుంటున్నామని ఆర్మీ చీఫ్ స్పష్టం చేశారు.


## తొలి సమయం క్యాలెండర్ ఆవిష్కరించిన

# డోర్నకల్ ఎమ్మెల్యే

### ప్రజా స్వామ్య పరిరక్షణ,ప్రశ్నించే గొంతుకగా

### తొలి సమయం నిబద్దతతో పని చేయాలి

### ప్రభుత్వవిప్, డోర్నకల్ శాసనసభ్యులు జాటోత్ డాక్టర్ రాంచంద్రు నాయక్



**తొలి సమయం మహబూబాబాద్ జనవరి:**
డోర్నకల్ నియోజకవర్గం, కొరివి మండలం, రేకుల తండాలో తొలి సమయం దిన పత్రిక క్యాలెండర్ ను ప్రభుత్వ విప్, డోర్నకల్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ రాంచంద్రు నాయక్ ఆవిష్కరణ చేసారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంత దిన పత్రిక తొలి సమయం అన్నారు, ఆదరించడం మన కర్తవ్యం అన్నారు, ప్రజా స్వామ్య పరిరక్షణ లో భాగంగా నిత్యం ప్రశ్నించే గొంతుకగా తొలి సమయం ప్రజల కోసం, సమస్యల పరిష్కారమే ద్యేయంగా పనిచేయాలని అన్నారు. ఎప్పుడు తొలి సమయం పత్రికకు ఆశీస్సులు ఉంటాయని దీవించారు ఈ కార్యక్రమం లోతొలి సమయం చీఫ్ ఎడిటర్ వి అయోధ్య రామయ్య కురవి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వీరభద్రం గౌడ్, మానుకోట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్,లీడర్ మేకింగ్ మిషన్ కోర్డినేటర్ బండి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## ప్రారంభమైన

# మహా కుంభమేళా



### తొలిరోజే కోటిన్నరమంది పుణ్యస్నానాలు

**ప్రయాగ్‌రాజ్,జనవరి13:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయోగ్‌రాజ్ లో ప్రారంభమైన మహా కుంభమేళా కు తొలిరోజే భక్తులు పోటెత్తారు. గంగ, యమున, సరస్వతీ నదుల సంగమంలో 1.50 కోట్ల మంది పవిత్ర స్నానాలు చేశారు. సోమవారంనాడు పుష్య పౌర్ణమి సందర్భంగా బీహార్, హర్యానా, బెంగాల్, ఒడిశా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ సహా పలు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో వివిధ ఘాట్లు కిటకిలలాడాయి. మహాకుంభమేళా వేలాదిగా తరలి వస్తున్న భక్తులకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అభినందనలు తెలిపారు. పుష్యమాస పౌర్ణమి రోజున త్రివేణి సంఘంలో పవిత్ర స్నానాల కోసం విచ్చేసి సాధువులు, కల్పవాసీలు, భక్తులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. 'మహా కుంభమేళా తొలిరోజు సనాతన ధర్మాన్ని ఆచరించే 1.50 కోట్ల మంది స్వచ్ఛమైన త్రివేణీ జలాల్లో పవిత్ర స్నానాలు చేయడం ద్వారా ఈ పండుగను విజయవంతం చేశారు. ఇందుకు సహకరించిన మహాకుంభ మేళా అడ్మినిస్ట్రేషన్, ప్రయాగ్‌రాజ్ అడ్మినిస్ట్రేషన్, మున్సిపల్ కార్పొరేషన్ ప్రయాగరాజ్, స్వచ్ఛాగ్రహీలు, గంగా సేవాదూత్‌లు, కుంభ్ సేవక్లు, మత-సామాజిక సంస్థలు, వివిధ వాలంటీర్లు, మిత్రులు, మీడియా ప్రపంచం సహా మహాకుంభ్‌తో మమేకమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ శాఖలకు ధన్యవాదాలు తెలియజేస్తు?న్నాను' అని యోగి పేర్కొన్నారు.'మహాకుంభ్' భిన్నత్వంలో ఏకత్వం సందేశాన్ని చాటుతూ భిన్న సంస్కృతులను ఏకం చేస్తోందని యోగి ఆదిత్యనాథ్ ఒక ట్వీట్‌లో అభివర్ణించారు. సాంస్కృతీ సమ్మేళనం ఎక్కడుంటుందో విశ్వాసం, సామరస్యం అక్కడే ఉంటుందన్నారు. ప్రయోగ్‌రాజ్ సనాతన ధర్మానికి ప్రతీకగా నిలుస్తోందని చెప్పారు. కాగా, తెల్లవారుజాము నుంచి దట్టమైన పొగమంచు, తీవ్రమైన చలిగాలులు ఉన్నప్పటికీ లెక్కచేయకుండా వేలాది మంది భక్తులు త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానాలకు ఎంతో ఉత్సాహంగా తరలివచ్చారు. వయోభేదం లేకుండా అన్ని రంగాలకు చెందిన ప్రజలు పవిత్ర స్నానాలతో పులకించిపోయారు. భజనలు, జై గంగా మయ్యా నినాదాలు మధ్య 'మహాకుంభ్' అంగరంగ వైభవంగా మొదలైంది.

## రైతులు, కూలీలకు

# కాంగ్రెస్ కుచ్చుటోపీ!


### ఎకరంలోపు ఉన్న వారందరికీ ఆత్మీయ భరోసా ఇవ్వాలి: హరీశ్

**సంగారెడ్డి టౌన్/జహీరాబాద్, జనవరి 13:** కుంటి సాకులు చెబుతూ రైతులు, వ్యవసాయ కూలీలకు కాంగ్రెస్ కుచ్చుటోపీ పెట్టిందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఎకరంలోపు భూమి ఉన్న ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్‌లతో కలిసి సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎకరంలోపు భూమి ఉన్న రైతులు 24.57 లక్షల మంది ఉన్నారన్నారు. ఇందులో ఎక్కువ శాతం దళితులు, గిరిజనులు, బీసీలు ఉన్నారని చెప్పారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అంటే వారి కడుపు కొట్టడమేనా? అని హరీశ్ ప్రశ్నించారు. రాష్ట్రంలో కోటి మంది వ్యవసాయ కూలీలు ఉండగా.. పది లక్షల మందికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తామని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. 90 శాతం మంది కూలీలకు రకరకాల కారణాలతో ఆత్మీయ భరోసా ఎగ్గొట్టే ప్రయత్నం చేయడం విచారకరమని చెప్పారు. కాంగ్రెస్ సర్కారు అడుగడుగునా రైతులను దగా చేస్తోందని ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రైతు విజయోత్సవాల్లో భాగంగా నవంబరు 30న సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ కోసం రూ.2,750 కోట్ల చెక్కును విడుదల చేశారని.. ఆ చెక్కుకే దిక్కులేదని ఎద్దేవా చేశారు. 'ఎన్నికల్లో డమ్మీ హామీలు ఇచ్చినట్లుగా రుణమాఫీకి కూడా డమ్మీ చెక్కులు ఇస్తున్నారా? ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో డబ్బులు ఎందుకు జమ కాలేదు?' అని హరీశ్ ప్రశ్నించారు.

# శ్రీ గోద రంగనాథ స్వామి కళ్యాణ మహోత్సవం

**తొలి సమయం తొర్రూరు జనవరి 13**

పెద్దవంగర మండలం చిట్యాల గ్రామంలో సీతారామాంజనేయ స్వామి దేవస్థానం నందు గోదారంగ స్వామి కళ్యాణ వేడుకలు





**ఎవరీ గోదా దేవి!**

శ్రీ విల్లిపుత్తూరులో విష్ణుచిత్తుడనే ఆళ్వారుకు తులసి వనంలో పసి పాపగా దొరికిన గోదాదేవి సాక్షాత్తు ఆ భూదేవి అవతారమని ప్రశస్తి. చిన్న వయసు నుంచే శ్రీకృష్ణుని తన భర్తగా భావిస్తూ, అయన కోసం అల్లిన పూలమాలలను ముందుగా తాను ధరించేదట. ఇది చూసి కలవరపడిన విష్ణుచిత్తుడు గోదా దేవిని కోపిస్తే స్వయంగా శ్రీరంగనాయకుడే విష్ణు చిత్తునికి స్వప్నంలో కనిపించి తనకు ఆ మాలలే తనకు ఇష్టమని చెప్పాడంట.

**గోదాదేవి వలచింది ఎవరిని?**

యుక్తవయసు వచ్చిన గోదాదేవికి వివాహం చేయదలచి ఆమె తండ్రి విష్ణుచిత్తుడు ఆమెకు ఎవరంటే ఇష్టమని అడగగా, ఆ శ్రీకృష్ణుడే తన భర్త అని ఆమె తెలుపుతుంది. అప్పుడు విష్ణుచిత్తుడు వటపత్రశాయితో మొదలు పెట్టి, 108 దివ్యదేశాలలో విష్ణు స్వరూపాలు వర్ణించి అందులో ఎవరిని ఆమె భర్తగా కోరుకుంటుంది అని అడగగా, శ్రీరంగంలో రంగనాథుని వర్ణించే సమయంలో ఆమె శరీరం గగుర్పాటుకు గురై, సిగ్గుతో తలవంచుకోగా ఆమె వరించింది శ్రీరంగనాయకుని అని విష్ణుచిత్తుడు గ్రహిస్తాడు. కానీ ఆయన చూస్తే భగవంతుడు. ఈమె చూస్తే మానవకన్య ఈ వివాహం ఎలా జరుగుతుందా అన్న ఆందోళనతో నిద్రిస్తున్న విష్ణుచిత్తునికి కలలో శ్రీరంగనాయకుడు కనిపిస్తాడు.

**కల్యాణానికి శ్రీరంగానికి ఆహ్వానించిన రంగనాధుడు**

విష్ణుచిత్తునికి కలలో కనిపించిన రంగనాధుడు “విష్ణుచిత్తుడు గోదా దేవిని తీసుకొని మేళతాళాలతో శ్రీరంగం వస్తే సాక్షాత్తూ పాండ్యమహారాజు ఛత్రధ్వజ చామరాదులతో, రత్నాదులచే అలంకరించబడిన దంతపు పల్లకిలో స్వాగతిస్తాడని, అక్కడే తాను గోదాదేవిని వివాహం చేసుకుంటానని” చెబుతాడు.

**రంగనాథునిలో ఐక్యమైన గోదాదేవి**

విష్ణుచిత్తుడు కలలో రంగనాయకుడు చెప్పినట్లుగా గోదాదేవిని, విల్లిపుత్తూరులోని ప్రజలనూ తీసుకుని శ్రీరంగానికి బయల్దేరాడు. పెళ్లి కూతురిగా అంతరాలయంలో ప్రవేశించిన గోదాదేవి అందరూ చూస్తుండగానే ఆ రంగనాథునిలో ఐక్యమైపోయింది. ఇదంతా మకర సంక్రాంతికి ముందు రోజైన భోగినాడు జరిగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి వైష్ణవాలయంలో భోగి రోజు గోదాదేవికి ఆ రంగనాథునితో వైభవంగా కళ్యాణం జరుపుతారు.

**కల్యాణ ప్రాప్తి**

పెళ్లి కాలేదని బాధపడుతున్న వారు, వివాహంలో ఆటంకాలు ఎదుర్కొంటున్న భక్తిశ్రద్ధలతో శ్రీ గోదా రంగనాథుల కల్యాణం చూస్తే అవివాహితులకు కళ్యాణ ప్రాప్తి కలుగుతుందని, అలాగే భార్య భర్తల మధ్య అపార్థాలు ఉంటే తొలగిపోయి అన్యోన్య దాంపత్యం సిద్ధిస్తుందని జ్యోతిష్య శాస్త్ర పండితులు చెబుతున్నారు. ఈ భోగి పండుగ రోజు మనం కూడా శ్రీ గోదారంగనాథుల కల్యాణంలో పాల్గొందాం. సకల శుభాలను పొందుదాం.

## కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘంలో పెడన ఆర్యవైశ్యులకు

# రికార్డ్ స్థాయిలో అత్యధిక పదవులు

**ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్యులలో అసమాన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి డా. కొల్లూరి !**

**కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సన్నిధి నాగసాయి**

పెడన /జనవరి 13



ఆంధ్ర ప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అనుబంధ సంస్థ కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘంలో పెడన పట్టణంలోని 28 మంది ఆర్య వైశ్యులకు ఉన్నత పదవులు ఇప్పించి ఆంధ్ర ప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ చరిత్రలో ఆల్ టైం రికార్డ్ సృష్టించారు డా. కొల్లూరి. ఈ సందర్భంగా పెడన శ్రీ వాసవి ప్రార్ధన మందిరంలో జరిగిన ఓ కార్యక్రమంలో కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సన్నిధి నాగసాయి, పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి చిన్న పదవులు పొందిన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సన్నిధి నాగసాయి మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలు పైబడి పెడన పట్టణ పరిసర ప్రాంత పేద ప్రజలకు తన సొంత నిధులతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి 2 గౌరవ డాక్టరేట్స్, 9 జాతీయ అవార్డులు సాధించి ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్యులకు ఎనలేని ఘన కీర్తిని తీసుకువచ్చిన ఒకే ఒక్కడు డా. కొల్లూరి అని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్యులలో అసమాన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి అని ప్రశంసించారు సన్నిధి నాగసాయి. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి చిన్న సూచన మేరకు కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘంలో పదవులు పొందిన వారి వివరాలు ప్రకటించారు కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం విద్యా వైద్య కమిటీ చైర్మన్ గా మామిడి వెంకట వరప్రసాదరావు, అధికార ప్రతినిధిగా చిట్టూరి పశుపతినాథ్ బాబు, వైద్య శిబిరముల కమిటీ చైర్మన్ గా ఆత్మకూరి సురేష్ కుమార్, 11 సూత్రాల కమిటీ వైస్ చైర్మన్ గా జల్లూరి రమేష్, సభ్యత్వ అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ గా జవాజి నాగరాజు, వర్తక వాణిజ్య మండలి వైస్ చైర్మన్ గా చిలకల శ్రీనివాస్ గుప్తా, ఆధ్యాత్మిక కమిటీ వైస్ చైర్మన్గా ఇమ్మడి మంగమోహన్, క్రీడలు సాంస్కృత కమిటీ వైస్ చైర్మన్ గా కొత్త మురళీకృష్ణ, పర్యావరణ పరిరక్షణ కమిటీ వైస్ చైర్మన్ గా కొల్లూరి రాజా, అవార్డ్స్ కమిటీ వైస్ చైర్మన్ గా తాడేపల్లి రామకృష్ణ వ్యక్తిత్వ వికాస కమిటీ వైస్ చైర్మన్ గా కొల్లూరి రాధాకృష్ణ ఆర్యవైశ్యల హక్కుల సాధన కమిటీ వైస్ చైర్మన్ గా సమయమంతుల కుమార్, టూరిజం కమిటీ కన్వీనర్గాపరిసి నాగభూషణం, సేవా కార్యక్రమాలు కన్వీనర్ గా కొల్లిపర పవన్ కుమార్, వధూవరుల పరిచయ కమిటీ కన్వీనర్ గా ఉరిమి సతీష్ ,యువజన విభాగం ఉపాధ్యక్షులుగా చిలకల బాలాజీ, ప్రాంతీయ కార్యదర్శిగా సిరిమల్లె ఫణీంద్ర, అవార్డ్స్ కమిటీ చైర్మన్గా జల్లూరి స్వరూప్, సేవాదళ్ విభాగం కోఆర్డినేటర్ గా జూపూడి సతీష్, సేవా కార్యక్రమాల కమిటీ వైస్ చైర్మన్ గా వంకదారు తోరణ్ కుమార్, క్రీడా కమిటీ వైస్ చైర్మన్గా మాత సాయి మహిళా విభాగం ప్రాంతీయ కార్యదర్శిగా కొమ్మూరి విజయదుర్గ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వైస్ చైర్మన్ గా కొల్లూరి పద్మ, వాసవి ప్రచార కమిటీ వైస్ చైర్మన్ గా మామిడి సావిత్రి, ధ్యాన శిక్షణ కమిటీ వైస్ చైర్మన్ గా తమ్మన లక్ష్మీ తాయారు, పర్యాటక కమిటీ వైస్ చైర్మన్ గా ఉదయగిరి గోపాల్, అవార్డ్స్ ప్రధాన కమిటీ కన్వీనర్ గా కొలిపర నరసింహారావు, క్రీడలు సాంస్కృతిక కమిటీ కోఆర్డినేటర్ గా వేముల రమేష్, తదితరులకు కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సన్నిధి నాగ సాయి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి చిన్న మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దేశ శ్రీనివాస్ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డా. కొల్లూరి చిన్న మాట్లాడుతూ నేను సూచించిన మేరకు కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం లో ఎన్నడూ లేని విధంగా నేను సూచించిన మేరకుఅత్యధిక పదవులు ఇచ్చి గౌరవించిన కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సన్నిధి నాగసాయికి కృతజ్ఞతలు తెలియజేశారు. కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘంలో నూతనంగా పదవులు పొందిన ఆర్యవైశ్య సోదర, సోదరీమణులకు ప్రత్యేకంగా అభినందించారు. మచిలీపట్నం మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పద్మనాభుని శేఖర్, కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాస్, పి ఆర్ ఓ చెక్క ఆంజనేయులు పాల్గొన్నారు.

# టిజీ సెట్ పై గ్రామాల్లో విస్తృత ప్రచారం

**ఎస్సీ గురుకుల సెక్రెటరీ అలుగు వర్షిణి ఆదేశాలతో కదిలిన డి సి ఓ ,ప్రిన్సిపాల్స్**

**కరీంనగర్ /జనవరి 13 :** రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ,ఎస్టీ ,బీసీ, గురుకులల్లో ఐదో తరగతి మొదలుకొని, 9వ తరగతి వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకో వాలని ముద్రించిన పోస్టర్లను, కరపత్రాలను ఎస్సీ గురుకుల సెక్రటరీ డాక్టర్ అలుగు వర్షిణి ఆదేశాలతో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు విస్తృతంగా గ్రామాలకు తరలి ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. అదేవిధంగా జోన్ 3 గురుకులాల అధికారి ప్రత్యూష టీజీ సెట్ గురించి ఆమె పరిధిలో ఉన్న ప్రిన్సిపాల్ కు, ఉపాధ్యాయులకు సూచించడంతో వారు సైతం గురుకుల విద్యార్థుల నూతన దరఖాస్తుల కోసం ప్రచారంలో ముందుకు వెళ్తున్నారు. కరీంనగర్ గురుకుల కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ కోసం విస్తృత ప్రచారంలో ముందంజలో కరీంనగర్ జిల్లా డిసిఒ /మానకొండూరు ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం ఉన్నారు. ఐదవ తరగతి మొదలుకొని , మిగతా ఎస్సీ బ్యాక్ లాగ్ సీట్లు కోసం ఒకేసారి కామన్ ఎంట్రెన్స్ నిర్వహించడం జరుగుతుంది. ఈ విస్తృత ప్రచారంలో కలెక్టరేట్లో హెల్ప్ డెస్క్ ను ప్రారంభించడం జరిగింది. గ్రామ గ్రామాల్లో తమ టీచర్స్ ని పంపిస్తూ విలేజ్ లెవల్లో కూడా అత్యధికమైనటువంటి ప్రాధాన్యత ఇవ్వాలని సోషల్ వెల్ఫేర్ సెక్రటరీ అలుగు వర్షిని ఆదేశాల మేరకు విస్తృత ప్రచారం చేస్తున్నటువంటి గురుకులాల ప్రిన్సిపల్స్ రుక్మాపూర్, అలుగునూరు, చొప్పదండి హుజురాబాద్ జమ్మికుంట మానకొండూర్ చింతకుంట అనేక స్కూల్స్ ప్రిన్సిపాల్ తో పాటు ఉపాధ్యాయులు , ఆఫీస్ సిబ్బంది అందరూ కలిసి వివిధ ప్రాంతాల్లో ని గ్రామాలు తిరుగుతూ ముఖ్యంగా ప్రిన్సిపాల్స్ అందరు కూడా వారి వారి నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలను కలుస్తూ ఐదవ తరగతి కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ చేపిస్తున్నారు. అంతేకాకుండా తమ సిబ్బంది స్కూలు టీచర్స్ , ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ ను కూడా గ్రామ గ్రామానికి పంపించి ముఖ్యంగా గ్రామీణ ప్రాంతం నుంచి ఎక్కువ అడ్మిషన్స్ వచ్చే విధంగా కోరుతూ వాళ్ళకి అవగాహన కల్పిస్తూ ఏ విధంగా అప్లై చేయాలి అనేటువంటి విషయాలు ప్రజలకి అవగాహన కల్పిస్తూ కరీంనగర్ జిల్లా ముందంజలో గ్రామ గ్రామంలో తన యొక్క ప్రచారాన్ని విస్తృత ప్రచారాన్ని కొనసాగించడం జరుగుతుంది.

## కొడకండ్ల మండల స్థాయి ముగ్గుల పోటీలు

**తొలి సమయం కొడకండ్ల జనవరి 13**




తేదీ 15 -01-2025 రోజున ఉదయం 8 గంటలకు హనుమాన్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గ్రామం మరియు మండల స్థాయి ముగ్గుల పోటీలు ఏర్పాటు చేయనైనది మహిళా మణులకు భోగి సంక్రాంతి పండుగ సందర్భంగా కొడకండ్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో బాలికలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ముగ్గుల పోటీలలో గెలిచిన విజేతలకు బహుమతులు ఇవ్వబడును కావున ఈ వేడుకలను వ్యవసాయ మార్కెట్ నందు ఏర్పాటు చేయడం జరిగింది.

## అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఫలాలు

**తొలి సమయం దంతాలపల్లి మండలం జనవరి 13**



జనవరి 26వ తేదీన ప్రారంభం కానున్న రైతు భరోసా కొత్త రేషన్ కార్డుల జారీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇందిరమ్మ ఇండ్లు పథకాల అమలుపై డోర్నకల్ నియోజకవర్గం పరిధిలో ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించాలని డోర్నకల్ శాసనసభ్యులు ప్రభుత్వ డాక్టర్ రామచంద్ర నాయక్ తెలిపారు. జనవరి 16 నుండి 20వ తేదీ వరకు అధికారులు గ్రామసభలు నిర్వహిస్తారు. అట్టి గ్రామ సభలకు అందరూ ప్రజలు హాజరు అయ్యేవిధంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు చూడాలని కోరారు.

## కురుమ కుల సంఘం భవన నిర్మాణానికి

# రూ.20 లక్షలు మంజూరు చేస్తా

**ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి హామీ..**

**తొలి సమయం నర్సంపేట జనవరి 13:**



నర్సంపేట నియోజకవర్గం కేంద్రంలో కురుమ కులసంఘం భవన నిర్మాణానికి రూ 20 లక్షల రూపాయలు మంజూరు చేస్తానని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హామి ఇచ్చారు. నర్సంపేట పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో ఆదివారం డివిజన్ కురుమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్ ను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం భాద్యులు తమకు నియోజకవర్గ స్థాయి లో కుల సంఘం భవనం లేదని, భవన నిర్మాణానికి కృషి చేయాలని కోరడంతో స్పందించి న ఎమ్మెల్యే మీరు ఐక్యమై స్థలాన్ని ఏర్పాటు చేసుకుంటే రూ 20 లక్షల తో భవన నిర్మాణంకు నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు పెండెం రామానంద్, నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్ రెడ్డి, బీరప్ప కురుమ కుల సంఘం డివిజన్ అధ్యక్షుడు బుడగొండ బిక్షపతి, కార్యదర్శి కంకల రాజు కుమార్, కోశాధికారి అల్లి రవి, డివిజన్ భాద్యులు కోరె సుధాకర్, కంచు రాజు, కంచు రవి, కొమ్మ కిరణ్, అమ్మ కిరణ్, చీర వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నర్సంపేటలో పాడి పశువుల అందాల పోటీలు

**.తొలి సమయం నర్సంపేట జనవరి 14:**




నర్సంపేటలో శాంతి సేన రైతు సంఘం ఆధ్వర్యంలో పాడి పశువుల అందాల పోటీలను సోమవారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పాల్గొని రైతులు మరియు పాడి పశువుల గురించి ప్రసంగించారు. రైతులు తీసుకువచ్చిన పాడి పశువులను ఈ పోటీలో నియోజకవర్గ రైతులు అన్ని రకాల పాడి పశువులు అందాలను ప్రదర్శించి రైతులను, ప్రేక్షకులను ఆనంద ఉత్సవాన్ని కలిగించింది. ప్రతి ఏటా భోగి మకర సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నారు వారికి శాంతి సేన రైతు సంఘం సభ్యులందరికీ ధన్యవాదాలు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు.. ఈ అందాల పోటీలో పాల్గొన్న వివిధ రకాల పాడి పశువుల కు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతుల్లో నెక్కొండ మండలం దీక్షకుంట గ్రామానికి చెందిన రావులపెల్లి మహేందర్ అతని అందాల కోడిపుంజుకు మొదటి బహుమతి లభించింది. అట్టి బహుమతిని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు... ఈ పాడి పశువుల అందాల పోటీల్లో నా కోడిపుంజు పాల్గొనడం నాకు మొదటి బహుమతి రావడం చాలా సంతోషమని రాజు ఆనంద ఉత్సవాన్ని తెలియజేశారు.

# కేసీఆర్‌ది రాజకీయ ఫలాయనమా

## వ్యూహాత్మక మౌనమా...

"బాధ్యత లేని తండ్రి...ఉన్న ఆదాయంతో సర్దుకుని కుటుంబాన్ని నడిపించడానికి బదులు, తరతరాలుగా తాతలనాటి ఆస్తులను అమ్ముకొని భార్యా పిల్లలతో రోజు రెస్టారెంట్లు,విందులు వినోదలకు ఖర్చు చేసాడు. బంధువులు స్నేహితులు ఇరుగు పొరుగు వారు ఏది అడిగితే అది ఇచ్చాడు హిమాలయ పర్వతం లాంటి ఆస్తి పాస్తులు మంచు పర్వతం లాగ కరిగి చివరకు పిల్లలను చదివించే స్తోమత లేక బజారున పడ్డాడు, అదే రాష్ట్రం లో జరిగింది.రాష్ట్రం లో తండ్రిగా ఉండాల్సిన కెసిఆర్ 7లక్షల అప్పులు చేశారు, అన్నీ ఇచ్చాను, నన్ను ఓడించారు అని జనం పై అలక పూనారు. నవ్వి పోదురు కాక నాకేమిటి సిగ్గు అనుకుంటూ.. ఫామ్ హౌస్ కే పరిమితం అయ్యారు...





- సిపం రేవంత్ గారు! ఉన్న వాస్తవాలు ప్రజల ముందు పెట్టు, వాళ్ళను కలుపుకొని వెళ్ళాలి..
- పాలన సౌలభ్యం పేరున భూములు గత ప్రభుత్వం అమ్మేసింది..
- తనకా పెట్టడానికి ఇంకేమి మిగల్లేదు.
- ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ప్రభుత్వం పడుతున్న ఇబ్బందులను కప్పి పుచ్చడం తో వ్యతిరేకత పెరుగుతోంది
- అధికారం లోకి రావడానికి అత్యుత్సాహం తో ఇచ్చిన హామీలే అనేది తేటతెల్లం అవుతోంది

**తొలి సమయం ప్రధాన ప్రతినిధి మహబూబాబాద్ జనవరి 13:**
అయితే రాష్ట్రం సిద్ధించింది, అభివృద్ధి సంక్షేమ పథకాల. అమలు పేరున ప్రభుత్వ భూములు మొత్తం అమ్మేసాడు, ఇంకా సి ఏం రేవంత్ రెడ్డి కి అమ్మడానికి భూములు లేవు అనేది ఓపెన్ సీక్రెట్. మొత్తం తెలుగు దేశం కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిదులను కారు ఎక్కించుకున్నాడు. 40ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ, తెలుగు దేశం మాతృ సంస్థల నుండి తెగ తెంపులు చేసుకున్న ఆ ప్రజా ప్రతినిధులకు వాళ్ళు ఏది కావాలంటే అది ఇచ్చిండు, కెసిఆర్ కు ఏమి కావాలో అది దక్కించుకున్నాడు. ఆయనకు తెలువక చేసాడు అంటే పొరపాటు,కరెక్ట్ సమయంలో ఓడి పోయారు .రైతు బందు, దళిత బందు, పెన్షన్స్,షాది ముబారక్,గ్రామాల్లో ఆయన అంటే దేవుడు అనిపించుకునే పనులు అన్నీ చేసాడు.రాష్ట్రం మొత్తం గా యాధ్రుచ్చికంగా కొద్దిమంది కోటేశ్వరలుగా ఎదిగిన వాళ్ళు అంతా బాపు మళ్ళీ కావాలి, రావాలి! అని కలలు కనడం సహజమే వారంతా కేటీఆర్ ,కవిత,కెసిఆర్ లకు కృత్ఙతాగా రోడ్ లెక్కి గావు కేకలు గాయి గాయి చేస్తుండడం అందులో భాగమే..అనే విశ్లేషణలు సర్వత్రా వినిపిస్తున్నాయి

**ఇదంతా వార్కౌట్ కాని పని అనేది కెసిఆర్ కు తెలుసు,**
వ్యూహాలు లేవు, ఎత్తుగడలు లేవు, కెసిఆర్ తన పని కానించుకొన్నాడు, ఇక మిగిలింది, కతను కంచికి పట్టించడం ఆయన ఇంటికి పరిమితం కావడంమే అనే అభిప్రాయాలు, విశ్లేషకుల విశ్లేషణలు వస్తున్నాయి కెటీఆర్ కవితల రాజకీయ భవిష్యత్తుపై ఆశలు పెట్టికున్న వలస మాజీ బి ఆర్ ఎస్ ప్రజా ప్రతినిధులది ఎండమావిని చూసి నీళ్లు గా భ్రమించి నట్లు గానే భావించాల్సి ఉంటుంది అనే విమర్శలు ఉన్నాయి..10ఏళ్లలోవీళ్ళు 40 ఏళ్ల రాజకీయ కేరీర్ లో లేనన్ని రాళ్లు పోగేసుకున్నారు అనే బలమైన విమర్శలు ఉన్నాయి కనుక ఎవరైనా తప్పు చేస్తే చట్టం పని తను చేసుకుంటుంది అనే విధానాన్ని కూడా కేటీఆర్ కవిత కెసిఆర్ హరీష్ లు ఒప్పుకునే పరిస్థితి లేదు డబ్బులు పెడితే జ్యూడిషల్ లో న్యాయాన్ని వాళ్ళ వైపుకు లాక్కోవచ్చును అనే బలమైన విశ్వాసం ఉన్నట్లు గా వాళ్ళ వ్యవహారం తీరు ఉన్నట్లు తెలంగాణా సమాజం అభిప్రాయాలు వ్యక్తం చేస్తోంది. కెసిఆర్ ప్రతిపక్షపాత్ర పోషించడం లేదు పైగా వీళ్ళు ముఖ్యమంత్రి అనే ప్రోటో కాల్ ను లెక్కచేయకుండా.. వెంట్రుక పీక్కో లేవు రేవంత్, గుంపు మేస్త్రి, నిండు సభలో సి ఏం ను ఏక వచనం లో శంభోదిస్తున్నారు రెచ్చగొట్టడం,మళ్ళీ ఇదంతా గమనిస్తున్న ప్రజల్లో అధికారం లోకి రావడానికి వ్యవరించే విధానం ఇది కాదు అనే ప్రశ్నలు, అభి ప్రాయాలు ఉత్పన్నం అవుతున్నాయి

**సిపం రేవంత్ రెడ్డి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలి**
ఉన్న ఆర్థిక పరిస్థితిని ఓపెన్గా చెప్పాలి, అధికారం లోకి వచ్చి 13నెలలు కావొస్తుంది, ప్రజలనుంచి భిన్న అభిప్రయాలు వ్యక్తం అవుతున్నాయి. సాధ్యఅసాధ్యాలను చెప్పాలి. ప్రభుత్వం లోకి వచ్చాక తెలుస్తోంది అంటూ అసమర్ధతతో మాట్లాడొద్దు..మొదట కాళేశ్వరం అవినీతి, రెండవ సారి ఫోన్ ట్యాపింగ్, తర్వాత ఈ..కార్ రేస్ ఇలా రోజుకో ట్విస్ట్ ముందుకు రావొద్దు.కెసిఆర్ కు అంతా తెలిసే చేసాడు. ఇక ఎవరు వచ్చినా పరిపాలన నల్లేరు నడక కాదు అనేది తెలిసే ఇంటికి పరిమితం అయ్యాడు ప్రతిపక్షం హొదా, క్యాబినెట్ హొదా ను జీతాన్ని ఎంజాయ్ చేస్తున్నాడు. రాజీనామా చేసి కొడుక్కో, బిడ్డకో అల్లుడుకో కట్ట బెట్టకుండా ఏది పోనిచ్చు కోకుండా.. ఉత్తిత్తి ప్రతపక్షంగా కుటుంబాన్ని ముందుపెట్టి, కాలక్షేపం చేస్తున్నారు ఇంత వెసులు బాటు ప్రజా స్వామ్యం లో సాధ్యం ఎలా అవుతుంది. అనే విమర్శలకు తావిస్తోంది ప్రతిపక్షం లో ఉండి అలివికాని హామీలతో అధికారం లోకి వచ్చిన రేవంత్ రెడ్డి, అధికారం కోల్పోయి, ప్రతిపక్షపాత్ర నిర్వహించకుండా. హొదాను, ప్రభత్వ జీతాన్ని కెసిఆర్ ఎంజాయ్ చెయ్యడం వీరిద్దరిపై అవకాశవాదం అవుతుంది కనుక సి ఏం రేవంత్ వాస్తవాలు ప్రజల ముందు ఉంచాలి. కెసిఆర్ ఉంటే ప్రతిపక్షహొదా లో ఉండాలి లేకుంటే రాజినామా చెయ్యాలి కనుక అధికార ప్రతిపక్షాల్లో వాంచిత మార్పు రావాలని తెలంగాణా ప్రజలు కోరుకుంటున్నారు

# అమ్మ జ్ఞాపకార్థం సంక్రాంతి ముగ్గుల పోటీలు

**అభినందించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**





**తొలి సమయం నర్సంపేట 13:**
నర్సంపేట గూగల్ లీలావతి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదవ ముగ్గుల పోటీలు మినీ స్టేడియం నందు గోక వినోద్ బాబు అధ్యక్షతన ఎంతో ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి విచ్చేసి మొదటి బహుమతి గుంటి విజయలక్ష్మి 10116 బహుమతులను అందజేశారు.

వీరితోపాటు రెండో బహుమతి గెలుచుకున్న వారిలో పొన్నం స్రవంతి, పోచాల రాధిక 5116 గెలుచుకున్నారు. మూడవ బహుమతి 3116 ముగ్గురికి, 20 మందికి వేయి రూపాయల చొప్పున ప్రత్యేక బహుమతులు అందజేశారు నిర్వాహకులు గోక వినోద్ బాబు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ గోక లీలావతి మెమోరియల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. ప్రతి సంవత్సరం వినోద్ బాబు వారి అమ్మ జ్ఞాపకార్థం సంక్రాంతి ముగ్గుల పోటీల నిర్వహించడం సంతోషించదగ్గ విషయమని ,నర్సంపేట పట్టణంలో కనివిని ఎరుగని రీతిలో ఇంత పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. 300 పైగా ముగ్గుల పోటీలలో మహిళలు పాల్గొన్నారు .ఈ కార్యక్రమానికి జబర్దస్త్ ఫేమ్ వర్ష సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా నిలిచింది. ఈ కార్యక్రమంలో కోక లీలావతి మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షులు తన ప్రేమి గ్రహీత గోక రామస్వామి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, టి పి సి సి సభ్యులు పెండెం రామానంద్, కౌన్సిలర్ రాజు, రాయిడి కీర్తి రెడ్డి, ఓర్సు, అంజలి, పాకాల మహిళా బ్యాంక్ అధ్యక్షులు పెండెం రాజేశ్వరి, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నల్ల భారతి తో పాటు పలువురు పాల్గొన్నారు.

## కడుకమనీయం కడు రమనీయంగా గోదా రంగనాయకుల కళ్యాణ మహోత్సవం



**తొలి సమయం తొర్రూరు జనవరి 13**
తొర్రూర్ గ్రామదేవత వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో గోదా రంగనాయకుల కళ్యాణ మహోత్సవం వైభవగా పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారంగా ఆలయ అర్చకులు అలహరి శ్యాంసుందర్ నిర్వహించడం జరిగింది దేశం రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో స్వామివారికి పాదపక్షాలనం కన్యాదానం జిలకర బెల్లం మాంగల్య ధారణ తలంబ్రాలతో వేదమంత్రోచ్ఛారణతో స్వామివారి కళ్యాణం జరిగింది ఈ కళ్యాణ మహోత్సవానికి పుర ప్రముఖులు మరియు తొర్రూర్ మండల బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఓలేటి లక్ష్మణాచార్యులు రాము రాజేష్ ఓలేటి శేషాచార్యులు కృష్ణమాచార్యులు ఫణీంద్ర కళ్యాణం లో పాల్గొనడం జరిగింది

## భోగి పండుగ సంబరాలు



**తొలి సమయం తొర్రూరు జనవరి 13**
భోగి పండుగ సందర్భంగా ముగ్గులు వేస్తారు కానీ భోగి రోజు ముగ్గు ఒక ప్రత్యేకత ముగ్గుగా వేసే వారికి ఇష్టం కూడిన మరింత కష్టం సాధారణంగా ముగ్గు వేసే చోటనే భోగి మంటలు వేస్తారు భోగి మంటల వలన చాలా కసువు తయారవుతుంది ఆ కసువు అంతా పారబోసి కడిగి ముగ్గు వేయడం కొంచెం కష్టంతో కూడుకున్నప్పటికీ ఇష్టమైన పనులు కాబట్టి చాలా ఆనందంగా చేస్తారు రోజు వేసే ముగ్గుల కన్నా ఈ రోజు మరింత అందంగా రంగు రంగుల రంగవల్లికలు వేస్తారు భోగి పండుగ రోజు పిల్లలపై భోగి పళ్ళు పండ్లు పోసి ఆశీర్వదిస్తారు అందుచేత ఈ పళ్ళను భోగి పళ్ళు అంటారు భోగి పళ్ళు ఆశీర్వాదాన్ని శ్రీమన్నారాయణ ని ఆశీస్సులుగా భావిస్తారు భోగి రోజున పిల్లలు చాలా ఆనందంగా గాలిపటాలు నిర్వహిస్తారు వివిధ రకాల గాలిపటాలు ఎగురవేయడంలో పోటీపడతారు సెలవులు ఉన్నందున వేరువేరు ప్రాంతాలకు చదువుల కోసం వెళ్లి విద్యార్థులు భోగి ముందు తమ సొంత ఊర్లో చేరుకొని అంగరంగ వైభవంగా భోగి సంక్రాంతి కనుమ పండుగలు చేసుకుంటారు భోగి మంటలు చలికాలంలో అత్యంత చలిగా ఉండే రోజు భోగి ఈ రోజున మంటలు వేసి చలికాచుకుంటారు ఆ మంటలను భోగి మంటలు అంటారు భోగి మంటలను ఎక్కువగా తాటి ఆకులను ఉపయోగిస్తారు ఈ ఆకులను భోగి కొన్ని రోజుల ముందే కొట్టుకొని తెచ్చి భోగిమంటల కొరకు సిద్ధం చేసుకుంటారు అనేక ప్రాంతాలలో ప్రత్యేకంగా భోగిమంటల కొరకు తాటాకు మోపులను పిల్ల వద్దకు తెచ్చి విక్రయిస్తున్నారు వీటితోపాటు మండలంలో మండగల పనికిరాని పాత వస్తువులను ముందు రోజు రాత్రి సిద్ధం చేసుకుని తెల్లవారుజామున సాధారణంగా నాలుగు నుంచి ఆరు గంటల మధ్యన ఎవరి ఇంటి ముందు వారు మంటలు పెడతారు

## బిజెపి పెద్దవంగర మండల అధ్యక్షుడిగా బొమ్మరబోయిన సుధాకర్

తొలి సమయం తోరూర్ జనవరి 13



పెద్ద వంగర మండలం బిజెపి మండల పార్టీ అధ్యక్షునిగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికైన బొమ్మన బోయిన సుధాకర్ అధ్యక్షునిగా ప్రకటించిన బిజెపి రాష్ట్రఅధ్యక్షులు. కిషన్ రెడ్డి జిల్లా అధ్యక్షులు ఆరుట్ల దశమంత్ రెడ్డి రాష్ట్ర నాయకులు చింత సాంబ మూర్తి గారికి జిల్లా రిటర్నింగ్ అధికారి ప్రకాష్ రెడ్డి గారికి కో రిటర్నింగ్ అధికారి దొంగరి మహేందర్ గారికి జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ రాజశేఖర్ గారికి ఉపాధ్యక్షులు రంగు రాము గారికి పాలకుర్తి నియోజకవర్గ కో కన్వీనర్ రిటర్నిగ్ ఆఫీసర్ సుంకర నేని కోటేశ్వరరావు గారికి మరియు మండల నాయకులకు బూత్ అధ్యక్షుల కు హృదయపూర్వక కృజ్ఞతలు.నాపై నమ్మకం ఉంచి రెండోసారి అధ్యక్షునిగా బలపరిచినందుకు పేరుపేరునా అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ నన్ను పార్టీ గుర్తించి రెండోసారి అవకాశం ఇచ్చినందున ఈ అవకాశాన్ని నేను సద్వినియోగం చేసుకుంటానని సమయస్ఫూర్తితో మంచి మనసుతో అంగీకరిస్తున్నాను పార్టీ కట్టుబాట్లకు ఉంటానని తెలియజేస్తూ అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# అనుమతులతో లెక్కలేదు

## - బరులు ఏర్పాటు యధాతథం - గుట్టుచప్పుడు కాకుండా కోడిపందాలకు రెడీ

**భీమవరం,జనవరి13:** సంక్రాంతి కోడి పందాలకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా భారీగా బరులు రెడీ అయ్యాయి. పందాల నిర్వాహకులు అనుమతుల కోసం ఎదురుచూస్తున్నారు. కొందరు ప్రజాప్రతినిధులు నేరుగా పందాల నిర్వాహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వందకుపైగా కీలక బరులు ప్రారంభించడానికి సర్వం సిద్ధమైంది. అయితే ఇప్పటికే రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం కోడిపందాల బరులు ఏర్పాటు కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు, రెవెన్యూ అధికారులకు ఆదేశాలిచ్చినప్పటికీ అవి ఈ పండుగ సీజన్‌లో ఖచ్చితంగా అమలయ్యే అవకాశాలు లేనట్టు తెలుస్తుంది. పోలీసు యంత్రాంగం కూడా చేతులెత్తేయడంతో పబ్లిక్‌గా బరులు ప్రధాన రహదారుల చెంతనే ఏర్పాటవుతున్నాయి.

వీటిని ప్రారంభించేందుకు ప్రజాప్రతినిధులు సైతం ముందుకు వస్తుండడంతో అధికారులు చేతులెత్తేసే పరిస్థితులు కనిపిస్తు న్నాయి. సంక్రాంతి పర్వదినాల ముసుగులో జూద క్రీడల నిర్వహణకు జోరుగా సన్నాహాలు జరుగుతున్నాయి. మూడు రోజుల పాటు జోరుగా కోడిపందేలు, జూదాలు నిర్వహించేందుకు పందెం రాయుళ్లు అందుకను గుణంగా సన్నాహాలు చేస్తున్నారు. ప్రధానంగా ఉభయ గోదావరి జిల్లాల వ్యాప్తంగా కోడిపందాల నిర్వాహణకు బరులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో కొబ్బరితోటలు, ఖాళీ ప్రదేశాలను ఎంపిక చేసుకుని అక్కడ ట్రాక్టర్లుతో చదును పనులు చేయిస్తున్నారు. మరోపక్క కోడిపందాలతో పాటు వాటి చెంతనే గుండాటలు ఆడుకునేందుకు రూ.లక్షల్లో అంతర్గత ఒప్పందాలు జరిగిపోతున్నాయని చెబుతున్నారు. మరోవైపు కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే కోడి పందాలు నిర్వహిస్తున్నప్పటికీ పోలీసు, రెవెన్యూ యంత్రాంగం ప్రేక్షక పాత్ర వహిస్తోంది. గతం కంటే భిన్నంగా జిల్లా వ్యాప్తంగా భారీగా పందెం బరుల ఏర్పాటుకు కూటమి నేతలతో పాటు వైసీపీ నేతలు కూడా ఎవరికి తగిన తీరిలో వారు బరుల ఏర్పాటులో రంగంలోకి దిగారు. జిల్లా వ్యాప్తంగా కీలక ప్రాంతాల్లో బరులు నిర్వహిస్తున్నారు. ఐ.పోలవరం మండలం మురమళ్ల, కాట్రేనికోన మండలం చెయ్యేరు, ముమ్మిడివరం మండలం కొత్తలంకలతో పాటు ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం, అమలాపురం మండలంలోని అనేక ప్రాంతాలతో పాటు రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట, రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో భారీగా పందెం బరులు ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు. 216 జాతీయ రహదారిని ఆనుకుని బరులు ఏర్పాటవుతున్నాయి. మరోవైపు సంక్రాంతి సంబరాల పేరిట సెట్టింగులు వేసి ఆ ముసుగులోనే గుండాట, పేకాట, కోడి పందాలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. అయితే పోలీసులు, రెవెన్యూ అధికారులు అక్కడక్కడా తమ ఉనికిని చాటుకునేందుకు ఫ్లెక్సీలు పెట్టి ఫొటోలు తీయడం 'షరా మామూళ్ల'గానే మారింది. మరికొన్ని చోట్ల పోలీసు బందోబస్తు నడుమ బరులను ట్రాక్టర్లతో దున్నేస్తున్నట్టు చేస్తున్నప్పటికీ అవి మొక్కుబడిగానే జరుగుతున్నాయి. బరి ఒకచోట ఉంటే మరోచోట ట్రాక్టర్‌తో దున్నే పనులు చేయడం కనిపిస్తోంది. ఈ సారి మురమళ్లలో భారీ ఏర్పాట్ల నడుమ కోడిపందాలు నిర్వహించడానికి వీఐపీ బరిని సిద్ధం చేస్తున్నారు. కోడిపందాల బరుల వద్ద కొన్నిచోట్ల ఇప్పటికే బెల్టుషాపులు పబ్లిక్‌గా వెలిశాయి. నిబంధనకు విరుద్ధంగా బహిరంగ లిక్కర్ విక్రయాలు పందెం బరుల వద్ద చేయడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పోలీసు యంత్రాంగం కనుసన్నల్లోనే బరులు ఏర్పాటయ్యే విధంగా కూటమి నాయకులు, పోలీసులతో మంతనాలు జరుపుతున్నారు. కొన్నిచోట్ల ప్రజాప్రతినిధులకు ఇష్టం లేకుండా బరులు వేస్తుంటే వాటిని పోలీసులు అడ్డుకునే విధంగా వ్యూహాలు రూపొందించారు.

# తెలంగాణ పసుపు బోర్డు ఏర్పాటు

## చైర్మన్‌గా పల్లె గంగారెడ్డి నియామకం



**న్యూఢిల్లీ,జనవరి13** తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సంక్రాంతి పండుగ సందర్భంగా శుభవార్త అందించింది. నిజామాబాద్ కేంద్రంగా కొత్తగా పసుపు బోర్డ్ ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించి, పల్లె గంగారెడ్డిని పసుపు బోర్డు చైర్మన్‌గా నియమించినట్లు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపి బండి సంజయ్ ప్రయత్నం ఫలించి బోర్డు ఏర్పాటు జరిగింది. గతంలో స్పైసెస్ బోర్డు ఏర్పాటు చేయగా, ప్రత్యేకించి పసుపుబోర్డు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ వచ్చింది. ఈ నిర్ణయంతో తెలంగాణలో పసుపు రైతుల క్రయ, విక్రయాలు, ప్రాసెసింగ్‌కు మరింత ప్రోత్సాహం లభించనుంది. నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు ప్రారంభోత్సవం జరగనున్నది. ఈ కార్యక్రమం తెలంగాణకు మరో ప్రాముఖ్యమైన మైలురాయి కానుంది. ఈ కార్యక్రమానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల, వ్యవసాయ శాఖల అధికారులు, పశ్చిమ రాష్ట్రాల ఇతర వ్యవసాయ సంబంధిత నాయకులు, తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిసింది. ప్రారంభోత్సవం సందర్భంగా పసుపు రైతులకు సంబంధించి వ్యూహాలు, నూతన ప్రాజెక్టులు, కేంద్ర ప్రభుత్వ విధానాలు, సహాయ కార్యక్రమాలను ప్రకటించే అవకాశం ఉంది. రైతులకు పసుపు విక్రయాలు, మార్కెట్‌కు ఉన్న అవరోధాలు, రుణాల వంటి అంశాలపై పలు ముఖ్యమైన చర్చలు జరగనున్నాయి. పసుపు రైతుల సమస్యలు, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టేందుకు కేంద్రం ఈ బోర్డు స్థాపించనుంది. తెలంగాణ రాష్ట్రంలో పసుపు సాగులో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న నిజామాబాద్, కొమురంభీం ఇతర జిల్లాలలోని రైతులకు ఈ బోర్డు ద్వారా మరింత సాయం అందనుంది. కేంద్ర ప్రభుత్వం పసుపు పంటను ఒక ప్రత్యేకమైన పరిశ్రమగా భావించి, రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ఈ బోర్డు ఏర్పాటును ప్రకటించింది. మరోవైపు ప్లలె గంగారెడ్డి రైతు సంక్షేమం కోసం పోరాడిన వ్యక్తి. ఆయన వ్యవసాయ రంగం మీద అవగాహన, పసుపు రైతుల సమస్యలను అర్థం చేసుకోవడంలో అనుభవం ఉన్న వ్యక్తి కావడంతో ఆయన నియామకాన్ని కేంద్రము సమర్థించింది. ఆయన మార్కెట్ ప్రవర్తన, గుణాత్మక అభివృద్ధిపై అనేక మార్గదర్శకాలపై అభిప్రాయం వెల్లడించారు. పసుపు బోర్డు ఏర్పాటు ద్వారా రైతులకు అనేక కొత్త అవకాశాలు రానున్నాయి. రైతులు పసుపు పంటను మరింత మంచి ధరలలో విక్రయించేందుకు మరింత సహాయాన్ని అందుకుంటారు. దీంతోపాటు పసుపు ప్రాసెసింగ్, ఎగుమతుల ప్రోత్సాహం, నూతన టెక్నాలజీలను ఉపయోగించి పంటల ఉత్పత్తి పెంచడం వంటి అంశాలపై రైతులకు మరింత అవగాహన పెరుగుతుంది. ఈ కొత్త బోర్డు ఏర్పాటుతో రైతులకు మంచి అవకాశం దక్కనుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల అనేక మంది రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# బడ్జెట్‌లో కిసాన్ సమ్మాన్ నిధికి కేటాయింపులు

## పెంచిన మొత్తం అందచేసేలా ప్రణాళికలు

**న్యూఢిల్లీ,జనవరి13:** ఫిబ్రవరి 1న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న పూర్తి బడ్జెట్లో రైతులకు గుడ్ న్యూస్ రాబోతుంది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద వార్షికంగా వచ్చే మొత్తం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. పలు వర్గాల సమాచారం ప్రకారం రైతులకు చెల్లించే వార్షిక మొత్తం రూ.6,000 నుంచి రూ.10,000 వరకు పెరుగుతుందని చెబుతున్నారు. దీంతో ఈ పథకంలో నమోదు చేసుకున్న రైతులందరూ దీని ప్రయోజనాన్ని పొందనున్నారు. బ్జడెట్ మొదటి రోజు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ విషయాన్ని ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. అయితే దీని గురించి అధికారికంగా ఎవరూ ప్రకటించలేదు. కానీ పెంచే ఛాన్స్ ఉందని అంటున్నారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి ఒక్కొక్కటి రూ. 2,000 చొప్పున మూడు వాయిదాలలో రూ. 6,000 అందిస్తుంది. ప్రతి వాయిదా చెల్లింపుల మధ్య నాలుగు నెలల అంతరం ఉంటుంది. తదుపరి విడత డబ్బును ఫిబ్రవరి మొదటి వారంలో విడుదల చేసే అవకాశం ఉంది. ఈ క్రమంలో బడ్జెట్లో ఈ మొత్తం పెంచిన తర్వాత, పెరిగిన మొత్తం చెల్లిస్తారా లేదా పాత వాయిదా వస్తుందా అని రైతులు ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం రైతులకు పూర్తి ప్రయోజనం లభిస్తుంది. కెవైసి పూర్తి చేయని రైతులు ఈ పథకం ప్రయోజనాలు పొందలేరు. అయితే గతంలో రైతులు ఏడాదికి రూ. 6 వేలను మూడు వాయిదాలను పొందుతారు. ఇప్పుడు పెంచనున్న రూ.10 వేల మొత్తాన్ని మూడు వాయిదాలలో ఎలా చెల్లిస్తారని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ పథకం కింద అందించే మొత్తం రూ.10,000 అందిస్తే రైతులకు వ్యవసాయ పనులు, కూలీలకు, కరెంట్ సహా ఇతర ఖర్చులకు ఈ నిధులను ఉపయోగించుకోవచ్చు. ముఖ్యంగా చిన్న రైతులకు ఈ మొత్తం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఈ నిధులు రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పవచ్చు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2018 డిసెంబర్ 1న ప్రారంభించింది. ఈ పథకం కింద రైతులకు ఆర్థిక సహాయం అందించడం లక్ష్యంగా ఉంది.

# రోడ్డు భద్రత గురించి తెలుసుకోండి

## వాహనదారులకు మంత్రి సీతక్క హెచ్చరిక

**ఆసిఫాబాద్,జనవరి13:**
కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో రోడ్డు భద్రత మాసాత్సోవాల్లో స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాహనదారలు రోడ్డు భద్రత గురించి తెలుసుకోవాలి అన్నారు. బీర్లకు, బార్లలో ఖర్చు చేస్తున్నారు.. కానీ ప్రాణానికి రక్షణనిచ్చే హెల్మెట్ కోసం మాత్రం ఖర్చు చేయడం లేదని వాపోయారు. జిల్లాలో గత ఏడాదిలో 213 మంది చనిపోయారు.. మనతో పాటు మనల్ని నమ్ముకున్న వాళ్లు ఉంటారు.. అందుకే రోడ్డు భద్రత ప్రతి ఒక్కరు పాటించాలని మంత్రి సీతక్క తెలిపారు. ఇక, వాహానాలు ఎక్కి డ్రైవింగ్ చేసేటప్పుడు మద్యం సేవించరాదు.. సెల్ ఫోన్ మాట్లాడుతూ.. డ్రైవింగ్ చేయరాదు అని సీతక్క సూచించారు.

# సొంతూరు సంక్రాంతి వేడుకల్లో బాబు కుటుంబం

## ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు



**చిత్తూరు,జనవరి13** చిత్తూరు జిల్లా నారావారిపల్లెలోని సంక్రాంతి వేడుకల్లో సీఎం చంద్రబాబు కుటుంబం సందడి చేస్తోంది. గ్రామంలోని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ అందమైన రంగవల్లులను ముఖ్యమంత్రి చంద్రబాబు, భువనేశ్వరి బ్రాహ్మణి లు కలిసి పరిశీలించారు. ఈ ముగ్గుల పోటీల్లో 126 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ అందరికీ భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పోటీల్లో భాగంగా రంగవల్లులు తీర్చిదిద్దిన వారందరికీ రూ.10,116 చొప్పున కానుక ఇస్తున్నట్లు తెలిపారు. అందరికీ సుఖ సంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. పిల్లలకు నిర్వహించిన వివిధ రకాల పోటీలను చంద్రబాబు చూసి ఆనందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలందరికి భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. 'పవిత్రమైన ఈ భోగి పండుగ మీకు, మీ కుటుంబానికి కొత్త వెలుగులు తేవాలని, పాత బాధలు పోయి సానుకూల దృక్పథంతో జీవితంలో ముందుకు సాగాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను. భోగి మంటలతో మీ సమస్యలన్నీ తీరిపోయి మీకు భోగ భాగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తున్నాను. మీ ఆశలు, ఆశయాలూ తీర్చడానికి ప్రజాప్రతినిధులుగా మేం అన్ని వేళలా మీతోనే ఉంటామని ఈ సందర్భంగా హామీ ఇస్తున్నాను. మీ అందరికి భోగి పండుగ శుభాకాంక్షలు.' అంటూ పోస్ట్ లో పేర్కొన్నారు.

# తెలుగు ప్రజలకు సిఎంల శుభాకాంక్షలు

## సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన బాబు, రేవంత్

**హైదరాబాద్,జనవరి13** కొత్త ఏడాదిలో వచ్చే తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి. మూడు రోజుల పాటు జరిగే ఈ పండుగ తొలిరోజు భోగి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలు తెలుగు ప్రజలకు భోగి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. భోగిమంటలతో సమస్యలు తీరిపోయి ప్రతి ఇంటా భోగ భాగ్యాలు కలగాలని ఇద్దరు సీఎంలు ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలందరికి సీఎం చంద్రబాబు భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. 'పవిత్రమైన ఈ భోగి పండుగ మీకు, మీ కుటుంబానికి కొత్త వెలుగులు తేవాలని, పాత బాధలు పోయి సానుకూల దృక్పథంతో జీవితంలో ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. భోగి మంటలతో మీ సమస్యలన్నీ తీరిపోయి మీకు భోగ భాగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తున్నాను. మీ ఆశలు, ఆశయాలూ తీర్చడానికి ప్రజాప్రతినిధులుగా మేం అన్ని వేళలా మీతోనే ఉంటామని ఈ సందర్భంగా హామీ ఇస్తున్నాను. మీ అందరికి మరొక్క మారు భోగి పండుగ శుభాకాంక్షలు.' అని ట్వీట్ చేశారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తెలుగు ప్రజలకు భోగి పండుగ సందర్భంగా శుభాకాంక్షలు చెప్తూ ఇలా ట్వీట్ చేశారు. 'పాత నిర్బంధపు చీకట్లను రూపుమాపుతూ, కొత్త కాంతులు పంచే భోగి మంటలు... ప్రజా పాలన తెచ్చిన మంచి మార్పులతో ప్రతి ఇంటా భోగభాగ్యాలు వెల్లివిరియాలని' ముఖ్యమంత్రి ఆకాంక్షిస్తూ అధికారిక ఖాతాలో ట్వీట్ చేశారు.

# జనసేన కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు

## భోగిమంటలు వెలగించిన మంత్రి నాదెండ్ల

**గుంటూరు,జనవరి13:**
తెనాలిలోని జనసేన కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.. జనసేన పార్టీ కార్యాలయంలో భోగి మంటలను వెలిగించారు మంత్రి నాదెండ్ల మనోహర్.. భోగి వేడుకల్లో వీర మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ప్రతి ఇంట్లో పండుగ వాతావరణం ఆనందంతో సుఖ సంతోషాలతో జరుపుకోవాలని కోరుకుంటున్నాం.. గత నాలుగైదు సంవత్సరాలుగా ఇబ్బంది పడుతున్న రైతాంగానికి కూటమి ప్రభుత్వం అండగా నిలబడిందన్నారు.. గత ప్రభుత్వం రైతులకు బకాయి పెట్టిన 1674 కోట్ల బకాయిలను కోటం ప్రభుత్వం రాగానే వారి ఖాతాలో జమ చేశాము.. రైతులు వద్ద ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోపే వారి ఖాతాల్లో నగదు జమ చెయ్యటం ద్వారా ముందుగానే సంక్రాంతి వచ్చిందని భావన రైతులు వ్యక్తం చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతుల పట్ల అద్భుతంగా పనిచేసినందుకు గర్వపడుతున్నాం అన్నారు మంత్రి మనోహర్.. 6830 కోట్ల రూపాయల ధాన్యం కొనుగోలు చేయటమే కాక 94 శాతం రైతుల ఖాతాల్లో నగదు చెల్లించాం అన్నారు.. గుంటూరు జిల్లాలో గత ప్రభుత్వం కేవలం 4000 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తే కూటమి ప్రభుత్వం సుమారు 70 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. పట్టుదలతో రాబోయే ఐదేళ్లలో రైతాంగం అద్భుతంగా ఉంటారని.. వారికి అండగా నిలబడతామన్నారు..

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101